# మనుషులున్నారు జాగ్రత్త!

"ఇవి తీసుకోండి! మా అమ్మగారు చేసారు. వేడి చల్లారకముందే తింటే రుచిగా ఉంటాయంట" అని ఎదురుగా ఉన్న టేబిల్ మీద పెట్టి, మరో మాట మాట్లాడకుండా నేను చెప్పే మాట వినకుండా, వచ్చినంత వేగంగా వెళ్లిపోయింది కుసుమ.

ఒక్కసారి కుసుమ తెచ్చిన ప్లేట్ వంక చూశాను. ఉల్లిపాయ ముక్కలు కాస్త ఎక్కువగా వేసి చేసిన పకోడీలు ప్లేటు నిండా ఉన్నాయి. ఆ ప్లేటును తీసుకోవాలా వద్దా అని కాసేపు తటపటాయించాను. అభిమానంతో తెచ్చినవి తిరస్కరించటం మంచిది కాదని ప్లేటును చేతిలోకి తీసుకుని ఒకటి నోట్లో వేసుకున్నాను. వేడి వేడిగా రుచిగా ఉండటం వలన త్వరగా నోట్లోకి పోతున్నాయి.

ప్లేటు ఖాళీ చేసి టేబిల్ మీద పెట్టి, పక్కనున్న కూజాలోని మంచి నీళ్లు తాగి, బయటకు వచ్చి నిల్చున్నాను. మనస్సు ప్రశాంతతని కోరుతుంటే డాబా మీదకు వెళ్లాను.

వాతావరణం అనుకున్నంత ఆహ్లాదంగా లేకపోయినా, అంతకంటే స్వచ్ఛమైన వాతావరణం నగరంలో అరుదు కాబట్టి అదే పరమానందంగా భావించుకుని డాబా పై పచార్లు చేస్తున్నాను.

కుసుమ తన ఇంటి ముందు ఉన్న సన్న జాజి పందిరి వద్ద పూలు తెంచుతూ ఉంది.

పచార్లు చేస్తున్న వాడిని ఆగి ఒక్కసారి పరిశీలనగా ఆ అమ్మాయివైపు చూశాను.

కుసుమ ఎంతో అందంగా కనిపించింది నా కంటికి. బహుశా! ఈ మాట ఎవరితోనయినా అంటే నాకు అందమంటే ఏమిటో తెలియదని వెర్రిగా చూసేవారున్నారు.

కాని కుసుమ అందగత్తె కాదని అందరూ ఎందుకంటారో నాకు ఎంత ఆలోచించినా అర్థమయ్యేది కాదు. బహుశా! వారికే అందమంటే ఏమిటో తెలియదేమో! అనిపిస్తుంటుంది.

ఏది ఏమైనా కుసుమ అందగత్తెనన్న అభిప్రాయానికి వచ్చాను. ఇందులో ఎవరేమి చెప్పినా సడలింపు అనేది ఉండదు.

అవును! నేను కుసుమ గురించి ఎందుకు ఇంత లోతుగా ఆలోచించాలి. ఆ అమ్మాయి అందగత్తె అయితే నాకేమిటి? కాకపోతే నాకేమిటి? మరొక్క అనుమానం. నేను కుసుమ గురించి ఆలోచించినట్లుగా, కుసుమ నా గురించి ఆలోచిస్తోందా! ఆ ముఖంలో అలాంటి ఛాయలు ఎప్పుడూ కనిపించవే! అయినా నాకేం తెలుస్తుంది ఆమె మనస్సులోని ఆలోచనలు.

ఈ ప్లేటు తనంతట తానుగా తెచ్చిందా! లేక వాళ్ల అమ్మ ఇచ్చి రమ్మంటే తప్పని సరియై తెచ్చిందా! వారు ఇలా ఇవ్వటంలోని ఆంతర్యం ఏమిటి? వారికేమిటి ప్రయోజనం.

కొందరు ఏ ప్రయోజనం ఆశించకుండానే తమకున్న వాటిని ఇతరులతో పంచుకుంటారు. బహుశా! వాళ్ళ ఈ కోవకు చెందిన వారేమో!

నేను ఈ ఇంటికి వచ్చి సంవత్సరం అవుతుంది. ఇక్కడి పరిసర కుటుంబాలను పరిశీలించితే కుసుమ వాళ్ల కుటుంబం ఒక్కటే మంచిదనిపించింది.

కుసుమ వాళ్ల అమ్మ పేరు పార్వతని, భర్త కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఆకస్మికంగా మరణించడంతో, ఆ ఊరు వదిలి ఇక్కడకు వచ్చి ఉంటున్నారని, ఈ ఒక్క కూతురు తప్ప మరెవ్వరూ లేరని, పక్క ఇంటి మారుతీరావు చెప్పగా విన్నాను. అతను చెప్పినదాన్ని బట్టి, వాళ్లను చూసి గమనించినదానిని బట్టి పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోయినా భర్త వలన వచ్చే పెన్షన్ డబ్బులతో గుట్టుగా జీవిస్తున్నట్లు గమనించాను.

ఎక్కువసేపు నిల్చుండ బుద్ధిగాక డాబా పిట్టగోడమీద కూర్చున్నాను.

సురేఖ గుర్తుకు వచ్చింది. సురేఖ చాలా చలాకీ పిల్ల. ఇట్టే మనుషుల్ని ఆకట్టుకోగలదు. ఎప్పుడూ కావాలని తనే ముందు పలకరిస్తూ ఉంటుంది. నాకిష్టం లేకపోయినా ఆఫీసులో కూడా నా పనులలో తలదూర్చి నాతో చనువు పెంచుకోవాలని తాపత్రయ పడుతుంటుంది.

నాకు మాత్రం ఆ చనువు వెనుక ఉన్న స్వార్థం అర్థమైంది.

ఆఫీసులో శేఖర్ మంచివాడు అంటున్నప్పుడు ఇష్టం లేనట్లు ముఖం పెడుతుంది. నా గురించి పొగడుతుంటే, ఆ రోజంతా ఆ అమ్మాయి ముఖంలోని ఈర్ష్యని గమనిస్తూనే ఉంటాను.

నన్ను పొగడుతుంటే అంత అయిష్టపడే ఆ అమ్మాయి నా కోసం ప్రయత్నం చేయటంలోని అర్థం ఏమిటి! నాకు ఎంత ప్రయత్నించినా బోధపడలేదు. కాని తను కోరుకున్నది అందుకోవాలనే తపన మాత్రం ఎంతో కనపడుతుంటుంది. అందని దానిని అందుకోవాలనే తపన ఉండటం మంచిదేనేమో! కానీ ఆ అందుకోవాలనుకునేది ఒక జీవితాన్ని అయినప్పుడు... ప్చ్!

అందుకోవటమనేదే పరమార్థంగా భావించే మనస్తత్వంగల మనిషిగా మాత్రమే నా మనస్సులో మిగిలిపోయింది సురేఖ.

కానీ నేను కోరుకునేది అలాంటి వాళ్లని కాదని చెప్పినపుడు ఆ అమ్మాయి ప్రతిస్పందన ఎలా ఉంటుందో నాకు తెలుసు. అందుకే సురేఖ ఎంత ప్రయత్నం చేస్తున్నా నేను మాత్రం మరింత దూరంగానే ఉంటున్నాననే చెప్పాలి.

"ఏమిటి శేఖర్! ఒంటరిగా కూర్చున్నావు" అనే మాట విని వెనక్కి తిరిగి చూశాను.

మారుతీరావు నవ్వుతూ కనిపించాడు. ఆ నవ్వులో ఏదో కల్తీ ఉందనిపించింది.

"అబ్బే! ఏం లేదండి. కాస్త తీరుబడిగా ఉంటే ఇటువచ్చి కూర్చున్నాను" అన్నాను అతనితో ఎక్కువసేపు సంభాషణ పొడిగించడం ఇష్టం లేక.

"ఇంకా ఏమిటయ్యా! ఈ ఒంటరితనం. చక్కగా పెళ్లి చేసుకుంటే, ఈ ఒంటరి జీవితం ఉండదు కదా?" అన్నాడు అదోలా నవ్వుతూ.

ఆ నవ్వు ఎంతో వెగటనిపించింది. అతడలా ఎందుకంటున్నాడో కూడా అర్థమైంది.

అతనికి కుసుమ, సురేఖలంత వయస్సున్న కూతురు ఉంది. ఆ అమ్మాయికి పెళ్లి చేయవలసిన సమయం దాటుతుందేమోనని అతని భయం.

మారుతీరావు మాటలు నేర్చినవాడని అందరూ అంటుంటారు. అయితే ఆ మాటలు అతని మనుగడను, ఆర్థిక స్థాయిని పెంచేటందుకు మాత్రమే ఉపయోగపడేవని నా అభిప్రాయం.

మానవుడి అవసరాలను ఆసరాగా తీసుకుని ఎక్కువ వడ్డీలు గుంజే వ్యాపారం అతను చేసేది. ఎంత వెల చెల్లించైనా సరే, తన కూతురుకి భర్త అనే ఒక సేవకుడిని తీసుకురావాలని అతని ఆరాటం.

అతని దృష్టిలో ఈ మధ్య బాగా నాటుకుపోయింది నేనే. అందుకే అవసరం లేకపోయినా వచ్చి, పరోక్షంగా ఆ కోరికని వెలిబుచ్చుతుంటాడు.

అచ్చు తన తండ్రి గుణాన్ని మూర్తీభవించిన కుమార్తె ఆ అమ్మాయి అని నాకు తెలుసు. అందుకే ఆమె గురించిన ఆలోచనే లేదు నా మనస్సులో.

"ఏమిటయ్యా శేఖర్! అలా మౌనంగా ఉండిపోయావు" అన్నాడు మారుతీరావు.

"మీ విషయం గురించేనండి. అరగంట క్రితం ఎవరో సుబ్బారావనే ఆయన అడిగాడండీ మిమ్మల్ని. మీకు డబ్బులివ్వటానికి తిరుగుతున్నట్లు అర్థమైంది" అన్నాను ఆ సోదిగాడిని వదిలించుకుందామని.

డబ్బుల మాట వినేసరికి "మళ్లీ వస్తానయ్యా!" అంటూ కంగారుగా వెళ్లిపోయాడు.

నా మనస్సు మళ్లీ కుసుమ వైపు మళ్లింది. కుసుమ సహజ సౌందర్యవతి. సురేఖలాగా లేనిపోని తళుకు బెళుకులతో అందంగా కనపించాలనే తపన కనిపించదు ఆ ముఖంలో. డాటరాఫ్ మారుతీరావులాగా అహంభావి కాదు. నా జీవితం సజావుగా సాగాలంటే ఆమెలాంటి వారి సహచర్యం కావాలని నా నమ్మకం.

ఆ నమ్మకాన్ని త్వరగా బలపరచుకోవాలనే తలంపు ఎక్కువైంది. నా తరఫు పెద్ద వాళ్లు ఎవరూ లేరు. అయినా రాయభారం అనేది నాకు నచ్చదు. అందుకే రేపు వెళ్లి కుసుమవాళ్ల అమ్మతో ఈ విషయం మాట్లాడదామని నిర్ణయించుకున్నాను.

... ... ...

కుసుమను నాకిచ్చి వివాహం చేయటానికి కుసుమ వాళ్ల అమ్మ ఇంత త్వరగా ఒప్పుకుంటుందని నేను అనుకోలేదు.

ఆ ఒప్పుకున్న తీరునుబట్టి చూస్తే ఇంతకుముందే ఈ విషయం మీద ఒక నిశ్చయం చేసుకున్నట్లు అర్థమైంది.

కుసుమని చూస్తే ఒక పక్క ఆశ్చర్యంగాను మరొకప్రక్క ఆనందంగాను ఉంది. ఆమె మేరుపర్వతం లాంటిది. కుసుమ ఎప్పటిలాగే ఉంది. కుసుమ వ్యక్తిత్వానికి ఇదొక నిదర్శనమనుకుంటూ. కాని బాగా పరికించి చూస్తే లోలోపల సంతోషంగానే ఉన్నట్లు అనిపిస్తుంది.

మనుషుల్లో చాలా రకాల వారుంటారు. వారిలో కొంతమంది తమకు తెలిసిన నిజాన్నిగాని, అబద్ధాన్నిగాని సుదీర్ఘం చేసి చెప్పందే నిద్రపోరు.

అదిగో! ఖచ్చితంగా అలాంటివారి ద్వారానే సురేఖకు, మారుతీరావుకి తెలిసింది.

అది తెలిసిన తర్వాత వారి ముఖాలు ఎలాగో ఉన్నాయి.

సాటి మనుషుల శుభాన్ని ఓర్వలేరు. ఆ శుభానికి వారు అర్హులు కారు. వారికి అర్హత లేనిది ఇతరులు పొందుతున్నప్పుడు ఆ ముఖాల్లో ఈర్ష్య ఎందుకు? ఆ కళ్లల్లో క్రోధం ఎందుకు?

వారు ఎంతటి ఈర్ష్యాద్వేషాలతో ఉన్నా మమ్మల్ని ఏం చేయగలరు?

బహుశా! వాడికీ, దీనికీ ఏం పొంతనలే – అని అనగలరు.

లేకపోతే ఈ వెధవను, ఆ నిరసపు ముండ తప్ప ఎవరు చేసుకుంటారు అని ప్రచారం చేయగలరు.

కాకపోతే ఎక్కడా గతిలేక వీడు దానిని కట్టుకుంటున్నాడు— అని అందరి చెవులలో ఊదగలరు.


అంతకన్నా మమ్మల్ని ఏం చేయగలరు.

సరిగ్గా పదిరోజుల తర్వాత జరిగే రోజులను తలచుకుంటే ఎంతో ఆనందంగా ఉంది. అప్పుడు కుసుమ, నేను ఒకటి కాబోతున్నాం. ఆ రోజును తలచుకుంటూ నిద్రలోకి జారిపోయాను.

... ... ...

ఊహించిన సంఘటనలు—అవి మంచిగాని, చెడునిగాని జరిగితే ఏమంత బాధ ఉండదు. కాని ఊహించని విషయాన్ని విన్నాను. అయినా నాకు షాక్ తిన్నట్లు ఏమీ







## పి.ఎం. సుందరరావు

లేదు కారణం చిన్నప్పటినుండి ఆనందానికి పొంగిపోవడం, దుఃఖానికి క్రుంగిపోవటం ఎరుగని వాడిని.

అందుకే ఈ రోజు ఇంత జరిగినా మామూలుగా ఉండగలిగాను. ఒకింత గాంభీర్యం నన్ను ఆవరించింది.

అందని దానికోసం అర్రులు చాచటం కొందరికి సహజం కావచ్చు. వారికి దక్కనిది ఇంకొకరు పొందుతున్నప్పుడు వారు ద్వేషినైనా పెళ్లాడతారనేది జగమెరిగిన నిజం. దాని గురించి నేనిప్పుడు బాధపడటం లేదు.

కానీ అలాంటి వారి మాటలు నమ్మి, మామూలు మనుష్యుల్లాగా బెదిరి, "మా అమ్మాయికి ఇప్పుడు పెళ్లి చేయదలచుకోలేదు" అని మారుతీరావులాంటి మనిషిచేత, కుసుమవాళ్ల అమ్మ కబురు చేయటం నాకు నిజంగా బాధనిపించింది.

ఒకసారి చుట్టూ చూసాను. చీకటి పరిసరాలను చుట్టేసింది. జనం అంతా నిద్రాదేవి ఒడిలో సేదతీరటానికి సిద్ధపడుతున్నారు.

మనస్సులో ఏదో తెలియని బాధ కలుగుతుంది.

బహుశా! వాళ్లు ఏం చెప్పి ఉంటే, వివాహానికి తిరస్కరించి ఉంటుంది అనే ఆలోచన ఒక పక్క తొలిచివేస్తుంది.

వాళ్లు ఏం చెప్పినా నమ్మటమేనా! మరొక పక్క బాధ.

ఏది ఏమైనా కుసుమ వాళ్ల అమ్మ అందరిలా ఆలోచించేదేనని అర్థమైంది. మనుషుల గురించిన నా అంచనా, ఈమె విషయంలోనే తారుమారైంది. ఆమె మనస్సును మార్చి, ఆ మనుషులకు జోహారులర్పించటానికి సందేహించనవసరం లేదనిపించింది.

నా వెనకగా ఏదో అడుగుల శబ్దం వినిపించి వెనక్కి తిరిగి చూసాను. ఆ చీకటిలో ఆ ముఖాన్ని పోల్చుకుని ఆశ్చర్యపోయాను.

"మా అమ్మ తరపున నేను క్షమాపణలు చెప్పుకుంటున్నాను. క్షమించండి" అన్నది తలవంచుకుని కుసుమ.

ఎందుకో నాకు తెలియకుండానే, నా కళ్లు నీళ్లతో నిండాయి. ఏమాట మాట్లాడటానికి గొంతు పెగలలేదు.

"క్రూర జంతువుల కన్నా ఈ మనుషులు అపాయకరమైనవారు. ఎందుకంటే క్రూర జంతువులని తెలియటం వలన మనం దూరంగా ఉంటాం. కాని మనిషి తోలుకప్పుకున్న ఈ జంతువులు, మనలో కలిసిపోయి మనకు హాని చేస్తున్నాయి. అది నేను అర్థం చేసుకోగలిగాను."

మనుషుల గురించి కుసుమ చెబుతున్న నిజానికి నా తనువు పులకించింది.

"ఒక మామూలు ఆడపిల్ల తల్లిలాగా మా అమ్మ ఆలోచించింది. శేఖర్‌తో ఒక రాత్రంతా ఒకే గదిలో ఉన్నా ఏమీ చేయలేకపోయాడంటే అర్థం చేసుకోండని మీ ఆఫీసులోని సురేఖ చెప్పింది. ఎంత కట్నమైనా ఇచ్చి శేఖర్‌ని మా ఇంటి అల్లుడిని చేసుకోవాలనుకున్నాను. మా అమ్మాయి భర్తమగాడు కావాలి గాని, ఇలాంటివాడు కాదని శేఖర్‌ని కాదన్నాను అని మారుతీరావు చెప్పాడు"

వారు ఎంత క్రూరమైన వారో అర్థమైంది నాకు.

"నాకు మీమీద నమ్మకం ఉంది. మీరు ఇక్కడ నుంచి దూరంగా వెళ్లిపోదామన్నా వెళ్లిపోదాం. లేదా ఈ మనుష్యులకు సవాలుగా ఇక్కడే నిలుద్దామంటే ఇక్కడే ఉందాం" అన్నది నా ముఖం వైపు చూస్తూ కుసుమ.

కుసుమవైపు ఒక్కసారి పరిశీలనగా చూసాను ఆ కళ్లలోని నమ్మకాన్ని గమనించాను.

ఆ చేయిని అందుకున్నాను.